క్లుప్తంగా

పురుగుల నివారణకు మందు పిచికారీ



సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో 15వ వార్డు పరిధి లోని చిన్నదర్పల్లి సమీపంలో ఉన్న గోదాంలలో సోమవారం సాయంత్రం బియ్యం, ఇతర ఆహార ధాన్యం సంచులపై నిర్వాహకులు లక్క పురుగుల నివారణ మందు పిచికారీ చేశారు. కొన్ని నెలలుగా ఇక్కడి గోదాముల నుంచి ఈ పురుగులు గాలిలో కలిసి సమీపంలోని నీల్యానాయక్‌తండా, లచ్చిరాంతండాలో ఇళ్లలోకి వస్తున్నాయి. దీంతో స్థానికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన గోదాముల నిర్వాహకులు తాజాగా ఈ చర్యలు తీసుకున్నారు.

ఎస్టీ గురుకుల ఫలితాలు వెల్లడి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9 వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి గతంలో నిర్వహించిన పరీక్షకు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదలయ్యాయని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నాగార్జునరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల వెబ్‌సైట్‌లో విద్యార్థులు పుట్టిన తేదీ, ఫోన్‌నెంబర్ ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, రాములుగౌడ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అంబలి పంపిణీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కలెక్టరేట్‌లో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడం కోసం నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంబలి కేంద్రం, చలివేంద్రం నిర్వహిస్తున్నారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం అంబలి పంపిణీ చేశారు. కార్యదర్శి రామకృష్ణ, నాయకులు ఇస్మాయిల్, రాంచంద్రయ్య, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ పనులు ప్రారంభం

అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సీసీ ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. స్నేహ చికెన్ ఎగుమతుల పరిశ్రమ అధినేత రాంరెడ్డి సొంతంగా రూ.20లక్షలను కేటాయించి సీసీ పనులను చేయిస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పనులను ప్రారంభించారు. పరిశ్రమ నిర్వాహకులు రామేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: న్యూమోతీనగర్ వర్షగిరి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏకాదశి సందర్భంగా భక్తిశ్రద్ధలతో సోమవారం కాశీ విశ్వేశ్వర రామలింగేశ్వర దేవస్థాన నిర్మాణ (కడప) పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ కాశీ నుంచి జలం, రామేశ్వరం నుంచి ఇసుకతో పాటు 22 బావుల నీళ్లు, రుద్రాక్షలు తీసుకువచ్చి శివాలయం నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇరివింటి వెంకటేశ్వరశర్మ, యాదగిరి, రాములు, నాగేశ్, శేఖర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల: చౌటగడ్డ తండాలో ఆదివారం రాత్రి భూతగాదాల నేపథ్యంలో పలువురిపై దాడి జరిగినట్లు జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటగడ్డతండా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోటేష్, అతడి కుటుంబసభ్యులు శివ, హన్మంతు, రాజు, వెంకటేశ్, సుభాష్ తదితరులపై ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేశారని తెలిపారు. వారిపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ జి. రవినాయక్



కరపత్రం విడుదల చేస్తున్న కలెక్టర్ జి. రవినాయక్ ఇతర అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని, దోమలు కుట్టకుండా చర్యలు తీసుకునేలా వారిని చైతన్యం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వేసవి కాలమైనప్పటికీ అప్పుడప్పుడు వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండి దోమలు పెరగడానికి ఆస్కారం ఉందని అందువల్ల కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయటం వంటి చర్యలు చేపట్టాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

- ఆయా పథకాల కింద జిల్లాలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ఆరోగ్య ఉపకేంద్రాలకు టెండర్లు, పట్టణంలో చేపట్టిన మార్కెట్ , మినీట్యాంక్ బండ్ తదితరాలు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన ధాన్యం మొత్తాన్ని సేకరించాలని ఆదేశించారు.

- మన ఊరు మన బడి పనులపై వచ్చే శుక్రవారం ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో సమీక్ష ఉంటుందని, ఆయా చోట్ల చేపట్టిన పనులపై ఎంఈఓలు నివేదికలు సమర్పించాలన్నారు.
- అదేవిధంగా ఆయిల్ పామ్ పెంపకంలో వచ్చే సంవత్సరం జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడంపై హార్టికల్చర్ అధికారులు దృష్టిసారించాలన్నారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార తయారీ సంస్థల క్రమబద్ధీకరణలో ఎక్కువ మంది లబ్ధి పొందే విధంగా చూడాలన్నారు. ఈనెల 17 నుంచి కలెక్టరేట్ వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన ఉంటుందన్నారు. ఈనెల 17 నుంచి 23 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. విషయంపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, మండల ప్రత్యేక అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు.
- సీఎం కప్‌లో భాగంగా 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి పోటీలకు ముందస్తు ప్రణాళిక రచించాలన్నారు. 18న జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఉంటుందన్నారు. అందుకు సంబంధించిన వివరాలతో నివేదిక తయారు చేయాలన్నారు.
- రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె. సీతారామారావు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5 వరకు జిల్లాలో సైకిల్ ర్యాలీలు, గ్రీన్ ర్యాలీలు తదితర కార్యక్రమాలు ఉంటాయని అధికారులు పాల్గొనాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈనెల 16న నిర్వహించనున్న జాతీయ డెంగీ దినోత్సవ కరపత్రం, ఇతర వాధ్యులపై అవగాహన కల్పించే కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రను విజయవంతం చేద్దాం



నవాబుపేట: భట్టి విక్రమార్క పాదయాత్ర మంగళవారం మండలంలో అడుగుపెట్టనుందని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లారవి, మైనార్టీ నాయకుడు ఖాజా కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాదయాత్ర రంగారెడ్డి జిల్లా నుంచి మండలంలోని కేశవరావుపల్లి కిలాట్‌నగర్‌లో పాదయాత్ర పాలమూర్ జిల్లాలోకి అడుగుపెడుతుందని అన్నారు. రాజేష్, నీల్యానాయక్, షబ్బీర్, ఎంపీటీసీ నర్సింహులు, రమేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

అడ్డాకుల: పోల్కంపల్లికి చెందిన గొల్ల శివయ్యకు రూ.3.50 లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరు కాగా సోమవారం అన్నాసాగర్‌లోని తన నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సిములుగౌడ్, శివరాములు తదితరులు ఉన్నారు.

సాదాసీదాగా తనిఖీ

రాజాపూర్ : కొత్తగా ఏర్పాటైన మండలంలో జాతీయ ఉపాధి పనులపై సోమవారం రెండవ విడత సామాజిక తనిఖీ సాదాసీదాగా జరిగింది. మండలంలోని 11 గ్రామాల్లో జరిగిన అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనాలు, లాండ్ లేవలింగ్, పాంఫడ్, నర్సరీలు, బయో ఫెన్సింగ్ పనులపై తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఆడిట్‌కు వచ్చిన అధికారులు కార్యదర్శులకు సూచించారు. అడిషనల్ డీఆర్‌డీఓ జకియాసుల్తానా, ఏపీడీ శ్రీపాద్, సోషల్ ఆడిట్ మేనేజర్ శ్రుతి, అంబుడ్స్‌మెన్ సంతోష్, ఎంపీడీఓ లక్ష్మీదేవి, సర్పంచ్ బచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని టోలీచౌకీలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ ఇండియా విద్యార్థులు సత్తాచాటి పతకాలు సాధించినట్లు షోటోకాన్ అర్బన్ అధ్యక్షుడు, ఎంఎస్‌కేడీఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే మోసీన్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రసాద్‌రాజు, రాఘవేంద్ర, కర్ణాకర్, కె.నీల్య, రమేశ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటనిది. ఎస్‌ఐ విజయ భాస్కర్ వివరాల ప్రకారం..మూసాపేటకి చెందిన గంగాధర్‌గౌడ్ ద్విచక్రవాహనంపై దేవరకద్ర మండలంలోని హజిలాపూర్ వైపు నుంచి ఆదివారం రాత్రి సొంత గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో వేముల సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఘటనలో గంగాధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని జిల్లా కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. క్షతగాత్రుడి బంధువు మల్లికార్జున్‌గౌడ్ సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మద్యం మత్తులో చెట్టును ఢీ కొట్టి..

మిడ్జిల్: వాడ్యాల్ సమీపంలో సోమవారం సాయంత్రం కల్వకుర్తి మండల పరిధిలోని వేపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల శివ మద్యం మత్తులో మహబూబ్‌నగర్ నుంచి కల్వకుర్తి వైపు కారు నడుపుతూ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. దీంతో అతడికి బలమైన గాయాలు అయ్యాయి. ఈ మేరకు నిమిత్తం 108లో అతడిని జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

బాలానగర్: ఎంపీపీ కమల అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మొదట ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాలు సర్వతోముఖాభివృద్ధిని సాధించాయని అన్నారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇతర కార్యక్రమాలు ఉండడంతో త్వరగా వెళ్లిపోయారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే చెప్పినా అధికారులు సమస్యలను పరిష్కరించడం లేదని 50 డీడీలు కట్టినా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ అందించలేదని పెద్దాబాయి తండా సర్పంచ్ తిరుపతి సభ దృష్టికి తీసుకువచ్చారు. డీడీలు కట్టి 3 సంవత్సరాలైనా స్తంభాలు పాతలేదని వీరన్నపల్లి సర్పంచ్ రాజు అన్నారు. మిషన్ భగీరథ నీరులేక గ్రామాల్లోని బోర్లు నడిపిస్తుంటే 1 బోరుకే ఏకంగా రూ.40 వేల బిల్లు వేశారని ఉడిత్యాల సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధికుక్కల బెడద ఎక్కువైందని అధికారులను సంప్రదిస్తే ఒక్కో కుక్క కుటుంబ నియంత్రణకు రూ.1500 నుంచి రూ.2000 వరకు ఖర్చు అవుతుందని అంటున్నారని పంచాయతీలే భరించాలంటే ఎలా అని వాయిల్‌కుంట తండా సర్పంచ్ గోపినాయక్ అన్నారు. పశువైద్యశాల డాక్టర్ల ఉడిత్యాల సర్పంచ్ మల్లేష్, పాఠశాల బిల్డింగ్ పనుల బిల్లులు ఆపుతున్నారని ఏడుగుట్టల తండా సర్పంచ్ నాయక్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో టీజీసీ చైర్మన్ వాల్యానాయక్, జెడ్పీటీసీ కల్యాణి, ఏఎంసీ చైర్మన్ రజిని, వైస్ ఎంపీపీ వెంకటచారి పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు

అడ్డాకుల: గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని భూత్పూర్ సీఐ రజితారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి తండాలో సోమవారం సాయంత్రం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐతో పాటు అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్, దేవరకద్ర, చిన్నచింతకుంట ఎస్‌ఐలు మాధవరెడ్డి, విజయ భాస్కర్, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, మోహన్ బాబు తమ సిబ్బందితో కలిసి తండాలో తనిఖీలు చేపట్టారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మానసికంగా, శారీరకంగా హింసించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు.

తెలంగాణ దేశానికే దిక్సూచీ



పెద్దాయపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలో పలు కార్యక్రమాల్లో సోమవారం పాల్గొని ప్రసంగించారు. పెద్దాయపల్లికూడలిలో గ్రామ ముఖద్వారాన్ని, కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో క్రీడాపోటీలను ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి ఆడారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం దేశానికి దిక్సూచీగా మారిందని ఎన్నో రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శంగా తీసుకుని పథకాలను అమలు చేస్తున్నాయని అన్నారు. టీజీసీ చైర్మన్ వాల్యానాయక్, ఎంపీపీ కమల, జెడ్పీటీసీ కల్యాణి, సామాజికవేత్త అభిమన్యురెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటచారి, ఏఎంసీ చైర్మన్ రజిని, గోపాల్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంలో తాలు తొలగించాలి



గండేడ్: రైతులు పండించిన ధాన్యంలో తాలు లేకుండా కచ్చితంగా తూర్పు పట్టాలని డీపీఎం చెన్నయ్య పేర్కొన్నారు. ఆశిరెడ్డిపల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. రైతులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. ఏపీఎం బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

జడ్చర్ల: మీనాంబరం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని టీటీడీ బోర్డు సభ్యులు మన్నె జీవన్‌రెడ్డి తెలిపారు. ఆల్వాన్‌పల్లి సమీపంలోని మీనాంబరం ఆలయంలో సోమవారం ఆయన పరుశవేదీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మండపం నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపాల్ ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, యాదయ్య, జంగయ్య పాల్గొన్నారు.



అర్హత ఉంటే మండలం చేయడానికి సిద్ధం



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: అర్హత ఉంటే గార్లపహాడ్‌ను మండలం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా గార్లపహాడ్‌కు వెళ్తుతున్న ఎమ్మెల్యేను మండలసాధన సమితి సభ్యులు అడ్డుకొని మండలంగా ప్రకటించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ మండలం కోసం పది గ్రామ పంచాయతీల తీర్మానం తప్పనిసరి అని ఇలాంటి అర్హత ఉంటే ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డి తదితరులు అడ్డుకున్న వారిలో ఉన్నారు.

బీఆర్ఎస్‌తో రాష్ట్ర అభివృద్ధి

అధికార బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడిందని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలో దమాయపల్లి–గార్లపహాడ్, తిర్మలంపల్లి–గార్లపహాడ్ బీటీ రోడ్డు రెన్యూవల్ పనులను, కేశ్వాపూర్‌లో హెల్త్‌సెంటర్, పారుపల్లిలో పంచాయితీ భవనం, శేరివెంకటాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం , అంకిళ్లలో హెల్త్‌సబ్ సెంటర్ భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శశికళ, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన సీఎం కప్ పోటీలు



జడ్చర్లలో పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి నెట్‌వర్క్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. భూత్పూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డితో కలిసి పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో నియోజక వర్గ క్రీడాకారులు గెలుపొందితే తన వంతుగా రూ.50,116 బహుమతి ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎల్కిచర్ల అథ్లెట్ మహేశ్వరిని సన్మానించారు. ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

- జడ్చర్లలో క్రీడలను జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి ప్రారంభించారు. ఎంపీడీఓ ఉమాదేవి, ఎంఈఓ మంజులాదేవి, నాయకులు పాల్గొన్నారు. కాగా ఎండలు ఎక్కువగా ఉండటంతో సోమవారం ఎలాంటి పోటీలు నిర్వహించలేదు. మంగళవారం పోటీలు జరగనున్నాయి.
- రాజాపూర్‌లో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పొరిబచ్చిరెడ్డి సోమవారం పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ సుశీల, రమేష్‌నాయక్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీఓ వెంకట్‌రాములు, ప్రధ్యానోపాధ్యాయులు రఘునందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేటలో ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య పోటీలు ప్రారంభించారు. 500 మంది క్రీడాకారులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



భూత్పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



గండేడ్‌లో..

- మిడ్జిల్‌లో మంగళవారం ఉదయం నుంచి పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లకు సంబంధించి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో డ్రా తీసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, పీఈటీలు పరుశ రాములు పాల్గొన్నారు.
- హన్వాడలో పోటీలను ఎంపీపీ బాల్‌రాజు సోమవారం ప్రారంభించారు. 200 మంది వరకు హాజరయ్యారు. కాగా అందులో ఒక్క అమ్మాయి కూడా లేకపోవడం గమనార్హం. ఎంపీపీ బాల్‌రాజు, తహసీల్దార్ బి శ్రీనివాసులు, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఎంఈఓ రాజునాయక్ పాల్గొన్నారు.

దరఖాస్తు దారులకు భరోసా కల్పించాలి



రాజాపూర్: పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం లభిస్తుందనే భరోసా కల్పించాలని రాజాపూర్ పోలీసులకు ఎస్పీ నరసింహ సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. దరఖాస్తులు వచ్చే తీరు వాటి పరిష్కారంపై ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఏవైనా సీసీ నెంబర్లు పెండింగ్‌లో ఉంటే త్వరగా తెప్పించుకుని వాటిని పరిష్కరించాలని సూచించారు. కేసు రికార్డులు ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాల గురించి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, జడ్చర్ల రూరల్ సీఐ జములప్పల నుంచి వివరాలు తీసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల రికార్డింగ్ ఫుటేజీలను పరిశీలించారు. ఆన్‌లైన్ మోసాలు, అమ్మాయిల వేధింపులు, బాల్య వివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యవంతులుగా మార్చాలన్నారు.

దేవరకద్ర బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్‌ఎమ్



దేవరకద్ర: మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి దేవరకద్ర బస్టాండ్‌ను సోమవారం పరిశీలించారు. బస్టాండ్‌కు సంబంధించిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, గతంలో కేటాయించిన స్థలం నక్షాను పరిశీలించారు. ఆర్టీసీ సాంకేతిక అధికారులతో మాట్లాడారు. నక్ష ప్రకారం ప్రహరీ నిర్మించాలన్నారు. అనంతరం బస్టాండ్‌లోకి వస్తున్న బస్సులకు సంబంధించిన చార్ట్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కంట్రోలర్ రామలక్ష్మికి సూచించారు.

నిరసన దీక్ష విరమణ



హద్దులు ఏర్పాటు చేస్తున్న సర్వే సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో లక్ష్మీనగర్‌లోని ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన సర్వే నం.247, 250లకు సంబంధించి సోమవారం జిల్లా అధికారులు రీ–సర్వే చేశారు. అనంతరం హద్దులను ఏర్పాటు చేసి అందులో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం ఆపివేయించారు. ఈ కట్టడాన్ని మంగళవారం జేసీబీతో కూల్చివేస్తామని హామీ ఇచ్చారు. దీంతో దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు నిరసన దీక్షలు విరమించారు. అనంతరం కలెక్టర్ జి.రవినాయక్‌ను కలిసి వెంటనే ఎస్సీ కార్పొరేషన్ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలంటూ వినతిపత్రం సమర్పించారు. అక్కడ అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కావలి కృష్ణ, ఐక్యవేదిక నాయకులు ఆర్. వెంకటేశ్, కొండయ్య, కె.కేశవులు, జి.చిన్న లక్ష్మీనగర్‌లోని సర్వే నం.247, 250లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాలమూరు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటస్వామి, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సింహయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.చెన్నకేశవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ జి.రవినాయక్, ఎస్పీ నర్సింహకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఆ స్థలంలో ఎస్సీ స్టడీ సర్కిల్ భవనం నిర్మించాలని కోరారు. ఎం.శ్రీరాములు, కె.కేశవులు, రాములు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమం

భూత్పూర్ : సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ పథకాల అమలు, గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని, ఆగస్టు నాటికి కర్వెన ప్రాజెక్టులో నీటిని నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. అన్నాసాగర్‌లో సోమవారం నియోజక వర్గంలోని వివిధ మండలాల అభివృద్ధికి మంజూరైన ప్రొసీడింగ్స్‌లను ప్రజాప్రతినిధులు, నాయకులకు అందజేశారు. కర్వెనలో 90శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో ఘణపురం కెనాల్ ద్వారా కందూరు పెద్దవాగు, ఊకచెట్టు వాగులు పారించడంతో భూగర్భ జలాలు పెరిగి ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందన్నారు. భూత్పూర్ మున్సిపాలిటీలో అన్ని తండాలకు బీటీ రోడ్డు మంజూరు కాగా కొన్నింటిని పూర్తి చేశామని, నియోజకవర్గానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.